TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 40 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | మే 20, 2026



2లో..

# జిల్లాలకూ ఐటీ విస్తరణ

- ‘బియాండ్ హైదరాబాద్’ దిశగా అడుగులు!
- 1500 ఎకరాల్లో భారీ ‘డేటా సిటీ’..
- ‘ఇన్వెస్ట్ తెలంగాణ’ ఏజెన్సీ ఏర్పాటు
- 3 నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ ‘టీ-ఫైబర్’ కనెక్టివిటీ
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు


**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో ఐటీ రంగాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం స్పీడ్ పెంచింది. ‘బియాండ్ హైదరాబాద్’ పాలసీలో భాగంగా జిల్లాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన ఐటీ, పరిశ్రమల శాఖల సమీక్షలో సీఎం పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాల్లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్, ఐటీ సంస్థలను ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంబడి వీటి ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. దీనివల్ల స్థానిక యువతకు సొంత జిల్లాల్లోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

### 1500 ఎకరాల్లో ‘డేటా సిటీ’

రాబోయే రోజుల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో సరికొత్త ‘డేటా సిటీ’ని ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు వరంగల్, కరీంనగర్, విజయవాడ రహదారుల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. డేటా సెంటర్ల నిర్వహణకు భారీగా నీటి అవసరం ఉంటుందని, అందుకోసం ప్యూర్ వాటర్‌కు బదులుగా ఎస్టీపీల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

## శంషాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

- రూ. 3.05 కోట్లు విలువని అంచనా
- ఇద్దరి నిందితుల అరెస్ట్



**శంషాబాద్ (హైదరాబాద్), వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికుల కదలికలపై అనుమానం వచ్చిన డీఆర్ఐ అధికారులు వారి లగేజీని తనిఖీ చేశారు. వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో అత్యంత చాకచక్యంగా దాచి తరలిస్తున్న 8.705 కిలోల హైగ్రేడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ. 3.05 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులిద్దరినీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేసినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## సెప్టెంబర్ 12, 13న ‘బ్రిక్స్’ శిఖరాగ్ర సదస్సు

### న్యూఢిల్లీకి పుతిన్, జిన్‌పింగ్?




2లో..

## మెటాలో మళ్లీ లేఆఫ్స్

‘వర్క్‌ఫ్రమ్ హోమ్’ అంటూనే సాగనంపిన సంస్థ




2లో..

## స్కూల్ బస్సులకు ‘ఫిట్‌నెస్’ తప్పనిసరి

- రవాణా శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వచ్చే జూన్ నెలలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థుల భద్రత కోసం రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. విద్యాసంస్థల బస్సులు, ఇతర రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ప్రమాణాలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్లు. డ్రైవర్లకు లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం ఉండాలి. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగిషర్ (అగ్నిమాపక పరికరం), ఎమర్జెన్సీ ఎగ్జిట్. విద్యార్థుల సంరక్షణ కోసం కచ్చితంగా ఒక అటెండర్‌ను నియమించాలి. అనుమతించిన సామర్థ్యానికి మించి (ఓవర్‌లోడ్) విద్యార్థులను తరలించినా, ఫిట్‌నెస్ లేకుండా నడిపినా వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని



అధికారులు తెలిపారు. ఇలాంటి ఓవర్‌లోడ్ వాహనాల్లో తమ పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు రవాణా శాఖ సూచించింది.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
బుధవారం, మే 20, 2026

# మెటాలో మళ్లీ లేఆఫ్స్

## 'వర్క్‌ఫ్రమ్ హోమ్' అంటూనే సాగనంపిన సంస్థ

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రముఖ సామాజిక మాధ్యమ దిగ్గజం 'మెటా' ఉద్యోగులకు మరోసారి షాకిచ్చింది. ఆఫీసులో ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు... తొలుత సింగపూర్, యూఎస్, యూకే ప్రాంతాల ఉద్యోగులను 'ఇంటి నుంచే పని చేయాలని కోరింది. ఆ తర్వాత తెల్లవారుజామునే ప్రభావిత ఉద్యోగులకు లేఆఫ్ ఈ-మెయిల్స్ పంపడం ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 78 వేల మంది ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మందిని మెటా తొలగించనుంది. ఈ లేఆఫ్స్‌లో ఎక్కువగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. భవిష్యత్తులో మరో 7 వేల మంది ఉద్యోగులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధుల్లోకి మార్చనున్నట్లు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెల్లే గేల్ ఇప్పటికే ప్రకటించారు. కంపెనీ తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయంపై ఉద్యోగ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతుండగా, ఈ ఏడాది చివర్లో మరికొన్ని తొలగింపులు కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం.

# సెప్టెంబర్ 12, 13న 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు

## న్యూఢిల్లీకి పుతిన్, జిన్‌పింగ్?



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ ఏడాది 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశాలు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా జరగనున్నాయి. ఈ అత్యున్నత స్థాయి సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పుతిన్ రాకను దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించగా, జిన్‌పింగ్ పర్యటనపై చైనా నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఉద్రిక్తతల తర్వాత తొలిసారి: 2020 గాల్వాన్ లోయ ఘర్షణలు, 2022 తవాంగ్ సరిహద్దు వివాదాల తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించనుండటం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు ఆయన 2019లో భారత్‌కు వచ్చారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం వంటి అంశాలపై బ్రిక్స్ దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఉమ్మడి ప్రకటన విడుదల కాకపోవడం ఇందుకు బలం చేకూరుస్తోంది. ఈ నేపథ్యంలో, అంతర్జాతీయ సవాళ్లు మరియు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా దిల్లీ వేదికగా జరగబోయే ఈ సదస్సుపై ప్రపంచ దేశాల దృష్టి నెలకొంది.

# జిల్లాలకూ ఐటీ విస్తరణ

- 'బియాండ్ హైదరాబాద్' దిశగా అడుగులు!
- 1500 ఎకరాల్లో భారీ 'డేటా సిటీ'
- 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఏజెన్సీ ఏర్పాటు
- 3 నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ 'టీ-ఫైబర్' కనెక్టివిటీ
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో ఐటీ రంగాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరాలకు విస్తరించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం స్పీడ్ పెంచింది. 'బియాండ్ హైదరాబాద్' పాలసీలో భాగంగా జిల్లాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఐటీ, పరిశ్రమల శాఖల కీలక సమీక్షా సమావేశంలో సీఎం పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాల్లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్, ఐటీ సంస్థలను ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్స్) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంబడి వీటి ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. దీనివల్ల స్థానిక యువతకు సొంత జిల్లాల్లోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

### 1500 ఎకరాల్లో 'డేటా సిటీ'

రాబోయే రోజుల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు వరంగల్, కరీంనగర్, విజయవాడ రహదారుల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. డేటా సెంటర్ల నిర్వహణకు భారీగా నీటి అవసరం ఉంటుందని, అందుకోసం ప్యూర్ వాటర్‌కు బదులుగా ఎస్టీపీల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

### ప్రపంచ స్థాయి సదుపాయాలతో 'ఫ్యూచర్ సిటీ'

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోబోతున్న ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్షించారు. ఫ్యూచర్ సిటీలో పూర్తిగా 'నెట్-జీరో' (కార్బన్ ఉద్గారాలు లేని) విధానాలను అమలు చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో 'ఏఐ సిటీ'ని నిర్మించాలని స్పష్టం చేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా ఫ్యూచర్ సిటీకే దక్కేలా చూడాలని, అవసరమైతే దీనికోసం తానే స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అభ్యర్థిస్తానని సీఎం అధికారులకు తెలిపారు. హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయడంతో పాటు, కంపెనీలు త్వరలోనే భూమిపూజలు చేసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

### సింగిల్ విండో కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ'

రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై (సింగిల్ విండో విధానంలో) అన్ని రకాల అనుమతులు వేగంగా లభించేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి, మన దగ్గర కూడా సరికొత్త ఐటీ, ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

### 'టీ-ఫైబర్' ప్రాజెక్టుకు డెడ్‌లైన్

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ 'టీ-ఫైబర్'పై సీఎం రేవంత్ రెడ్డి కఠిన డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా టీ-ఫైబర్ నెట్‌వర్క్ పరిధిలోకి రావాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.54 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. మరోవైపు, రాష్ట్రంలో రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతిపాదిత 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'తో ప్రముఖ ఐటీ, పారిశ్రామిక కంపెనీలు ఎంఓయూలు (MoUs) కుదుర్చుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# వేయి స్తంభాల గుడిలో కంచి పీఠాధిపతి రుద్రాభిషేకం

- 10 ఏళ్ల తర్వాత చారిత్రక ఆలయాన్ని సందర్శించిన శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ
- 142 మంది వేద పండితుల పూర్ణకుంభ స్వాగతం..
- కనులపండువగా వైదిక క్రతువులు



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చారిత్రిక హనుమకొండ నగరంలోని శ్రీ రుద్రేశ్వర స్వామి వారి వేయి స్తంభాల దేవాలయం బుధవారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. కాంచీపురం కంచి కామకోటి పీఠం జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ దాదాపు పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈరోజు ఉదయం 9 గంటలకు ఈ పురాతన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్ కుమార్ పర్యవేక్షణలో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 142 మంది వేద పండితులు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామీజీకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మహిళా భక్తులు మంగళహారతులతో నీరాజనాలు అర్పించారు. ఆలయ ప్రవేశం అనంతరం స్వామీజీ తొలుత ఉత్తిష్ఠ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధానాలయంలోని రుద్రేశ్వర స్వామి వారికి వేద పండితుల నమక, చమక పఠనాల నడుమ జగద్గురువులు స్వయంగా రుద్ర మంత్రాలను ఉచ్చరిస్తూ దాదాపు 40 నిమిషాల పాటు వైభవంగా అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ పక్షాన అధికారులు స్వామీజీకి పట్టు వస్త్రాలు, శేష వస్త్రాలు సమర్పించి సత్కరించారు. రేపటి నుంచి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి సన్నిధిలో గోదావరి, ప్రాణహిత నదులతో కలిసే అంతర్వాహిని 'సరస్వతి నది' అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్నట్లు స్వామీజీ వెల్లడించారు. ఈ పుష్కర స్నానం అమృత కల్లోత్సవంతో సమానమని, జీవితకాలంలో చేసే పుణ్యఫలాన్ని ఇస్తుందని తెలిపారు. ముక్కోటి దేవతలు కొలువై ఉండే ఈ పుణ్య నదిలో స్నానాలు ఆచరించి, పితృదేవతలకు పిండప్రదానాలు చేయడం ద్వారా జన్మజన్మల పాపాలు నశించి, పూర్వీకులకు పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని, భక్తులందరూ ఈ పుష్కరాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహత్తర కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు మణికంఠ శర్మ, సందీప్ శర్మ, ప్రణవ్, దుర్గా శర్మ, శివకుమార్, అనిల్ కుమార్, నిఖిల్ శర్మ, శ్రీమన్నారాయణ చార్యులు, శ్రీవత్సవచార్యులు, ఫణిభూషణ శర్మ, పాపరిది శర్మ, కృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్ యువతి కిడ్నాప్ కేసు సుఖాంతం

## ఛేజ్ చేయడంతో పారిపోయిన దుండుగులు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అత్తాపూర్‌లో యువతి కిడ్నాప్ కథ సుఖాంతంగా ముగిసింది. ఎట్టకేలకు యువతిని పోలీసులు ట్రేస్ చేశారు. మలక్‌పేట్‌లోని తన ఇంట్లోనే యువతి సేఫ్‌గా ఉన్నట్లు తెలిపారు. ఫోన్ నంబర్ ఆధారంగా యువతిని పోలీసులు గుర్తించారు. అత్తాపూర్ జోయ్ ఆస్పత్రి వద్ద అర్ధరాత్రి యువతి కిడ్నాప్ అవడం సంచలనం సృష్టించింది. ఓ యువతిని కొందరు వ్యక్తులు థార్ కార్‌లో వచ్చి అందరూ చూస్తుండగానే బలవంతంగా కిడ్నాప్ చేశారు. విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగారు. యువతిని కిడ్నాప్ చేసిన కారును ఛేజ్ చేశారు. అయితే కిడ్నాపర్లు పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. కార్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో వివరాలు సేకరించడం పోలీసులకు కష్టంగా మారింది. జోయ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యువతిని కొందరు వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కిడ్నాప్‌కు ముందు యువతి ఆస్పత్రి పక్కనే ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌కు వెళ్లి అక్కడ కొన్ని వస్తువులను కొనుగోలు చేసి.. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్ నంబర్ ఆధారంగా.. మలక్‌పేటకు చెందిన యువతిగా నిర్ధారించారు. అక్కడకు వెళ్లి చూడగా.. యువతి తన ఇంట్లోనే సేఫ్‌గా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
బుధవారం, మే 20, 2026

# గ్రామాల సమగ్రాభివృద్దే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- కొండారెడ్డిపల్లిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ
- ఏటీసీ సెంటర్, మోడల్ స్కూల్ స్థలాల పరిశీలన
- పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశం



**వంగూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఆయన కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. గ్రామంలో పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏటీసీ సెంటర్‌కు అవసరమైన 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఏటీసీ నిర్మాణంతో పాటు ప్రత్యేక మోడల్ స్కూల్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాలను కేటాయించే విషయమై అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు అందించారు.

## మిల్క్ సెంటర్, పశువైద్య కేంద్రాల తనిఖీ

ఇటీవలే గ్రామంలో ఆధునిక సదుపాయాలతో ప్రారంభించిన మిల్క్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. పాల ఉత్పత్తిదారులకు అందుతున్న సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పాల సేకరణ మరియు టెస్టింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి, పశుసంవర్ధక సేవలు గ్రామస్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## నాణ్యతతో కూడిన పనులు..

"విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం. నిర్మాణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య కేంద్రం పనుల్లో నాణ్యత పాటించి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి." అని కలెక్టర్ డా.హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సంప్, నీటి శుద్ధి కేంద్రాన్ని (ట్రీట్‌మెంట్ ప్లాంట్) కలెక్టర్ పరిశీలించారు. పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగుదలే ప్రజారోగ్యానికి అత్యంత కీలకమని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని హెచ్చరించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రతి కార్యక్రమం ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. అధికారులంతా గ్రామస్థులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేర్చాలన్నారు. అంతకుముందు కలెక్టర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయకుమార్, డీఈఓ రమేష్ కుమార్, డివిజన్, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# 24 గంటల్లో చోరీ కేసు గుట్టు రట్టు

## ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



**ఆత్మకూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల కేంద్రానికి సమీపంలోని గూడెప్పాడ్ గ్రామం రామాలయంలో జరిగిన పవిత్ర వెండి వస్తువుల చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల వ్యవధిలోనే అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి వంద శాతం దొంగతనానికి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల ఏసీపీ సతీష్ బాబు కేసు వివరాలను వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. మే 18న రాత్రి గూడెప్పాడ్ రామాలయ గర్భగుడి తాళాలను పగలగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించారు. స్వామివారికి చెందిన సుమారు రూ.2.43 లక్షల విలువైన 1080 గ్రాముల బరువు గల వెండి శఠగోపాలు, ప్లేట్లు, గిన్నెలు, గద, చెంచా తదితర పూజా వస్తువులను అపహరించుకుపోయారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. దొంగతనం జరిగిన వెంటనే ఆత్మకూరు పోలీసులు అలర్ట్ అయ్యారు. బుధవారం ఉదయం రహదారిపై ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా ఆలయంలో దొంగతనం చేసినట్లు ఒప్పేసుకున్నారు. అరెస్టయిన నిందితులు కల్లకూరి కిరణ్ బాబు (భీమవరం, ఏపీ), కడవకల్లు సందీప్ కుమార్ (అనంతపురం జిల్లా, ఏపీ)గా గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడైన కిరణ్ బాబుపై గతంలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు చోరీ కేసులు నమోదై ఉన్నాయని ఏసీపీ వివరించారు. నిందితుల నుంచి వెండి వస్తువులను రికవరీ చేసి, వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది.గ్రామాల్లో, మండల పరిధిలో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా తిరిగే వాహనాలు కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ సతీష్ బాబు కోరారు. కాగా, కేసు నమోదైన 24 గంటల్లోనే దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేసిన ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సై మరియు పోలీస్ సిబ్బందిని వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

# సెల్ టవర్ తొలగించాలంటూ ఆందోళన



**వరంగల్ , వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలోని 39వ డివిజన్ శాఖరాసి కుంట ఏకశిల కాలనీ వద్ద గత 18 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన సెల్ టవర్ ను తొలగించాలంటూ స్థానిక మహిళలు గృహవాసులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్ టవర్ వల్ల రేడియేషన్ ఎక్కువై స్థానిక ప్రజలు రోగాల పాలవుతున్నారని, చాలామంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. వెంటనే సెల్ టవర్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో చాలాసార్లు ఫిర్యాదు కూడా చేశామని అయినా కూడా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సెల్ టవర్ వద్ద జనరేటరు, బ్యాటరీలు ఇతర పరికరాలను అమర్చడానికి తీసుకురావడంతో వాటిని స్థానికులు అడ్డుకున్నారు. సెల్ టవర్ తీసేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వంచనగిరి కిషోర్, స్వప్న, కమటం వేణుగోపాల్, కనుకుంట్ల శ్రీమన్నారాయణ, గన్నోజు ప్రవీణ్, దేవులపల్లి నీలా, రావుల శ్రీనివాస్, స్రవంతి, భాగ్యలక్ష్మి, ఎండీ అంజద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- అర్హులకు కొత్త జాబ్ కార్డులు అందజేయాలి




**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు డిమాండ్ చేశారు. ఉప్పునుంతల మండలంలోని తాడూరు గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతల నాగరాజు మాట్లాడుతూ.. ఎండల తీవ్రతను తట్టుకుంటూ ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు సకాలంలో వేతనాలు అందకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీల పొట్టగొట్టే విధానాలను మానుకోవాలని హితవు పలికారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలి. గ్రామంలో అర్హులైన వారందరికీ కొత్తగా ఉపాధి హామీ జాబ్ కార్డులను మంజూరు చేయాలి. కూలీలకు ఇబ్బందికరంగా మారిన రోజుకు రెండు ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేయాలి. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు ఇచ్చే సమ్మర్ అలవెన్స్‌ను తిరిగి వేతనంలో కలిపి అందించాలి. కూలీల హక్కులను కాలరాసే వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి. "ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారు. రెండు పూటలా ఫోటోలు పెట్టాలనే నిబంధనతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే కూలీలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం." అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ నాయకులు గట్టు కృష్ణయ్య, గుండెమోని వెంకటయ్య, ఎండి జాంగిర్, గుండెమని సైదులు, బురాన్, సాబేర, పిల్లి కృష్ణమ్మ, భాగ్యమ్మ, తిరుపతయ్య, అలివేల ధనలక్ష్మి, సీనియర్ మేటు శివకుమార్, గొడుగు శ్రీకాంత్,ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, మే 20, 2026

## ఉపాధి హామీ కూలీలకు భోజనం వితరణ



**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తీవ్రమవుతున్న వేసవి ఎండల నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎదురుగట్ల గ్రామ సర్పంచ్ కదారి సంధ్య – తిరుపతి కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీల కోసం బుధవారం గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 'వంట–వార్పు' నిర్వహించి, ఉదయం భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్తున్న క్రమంలో వారి సౌకర్యార్థం పాలకవర్గమంతా ఏకగ్రీవ నిర్ణయం తీసుకుని ఈ భోజన వసతిని కల్పించినట్లు తెలిపారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున కూలీలు, గ్రామస్తులు వివిధ పనులకు వెళ్లే సమయంలో ఆరోగ్య విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ సూచించారు. పనుల ప్రదేశంలో తగినన్ని మంచినీళ్లు, నీడ సౌకర్యం ఉండేలా చూసుకోవాలని, నీరసంగా అనిపిస్తే వెంటనే ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. "కూలీల సంక్షేమమే ధ్యేయంగా గ్రామ పాలకవర్గం పనిచేస్తోంది. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ఉదయం భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలి." అని గ్రామ సర్పంచ్ కదారి సంధ్య – తిరుపతి సూచించారు. ఈ భోజన వితరణ, అవగాహన కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు నవ్య – వేణు, విజయ – వెంకటేశం, భీరయ్య, ప్రకాష్, రాజేంద్రప్రసాద్‌లతో పాటు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

## మల్లాపూర్ పెంటలో శాస్త్రీయ తేనెటీగల పంపిణీ

- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- లబ్ధిదారులకు తేనెటీగల బాక్సుల అందజేత



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల చెంచు మహిళా సమాఖ్య సమక్షంలో, అమ్రాబాద్ మండలం మల్లాపూర్ పెంటలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ తేనెటీగల పెంపకం, తేనె ఉత్పత్తి జీవనోపాధి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. సెర్ప్ మరియు 'హంబుల్ బీ' సంస్థల సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన తేనెటీగల బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. 'హంబుల్ బీ' సంస్థ దేశవ్యాప్తంగా తేనెటీగల పెంపకదారులను ప్రోత్సహిస్తూ స్థిరమైన జీవనోపాధిని కల్పిస్తోందని అభినందించారు. తేనెటీగల వల్ల పంటల దిగుబడి పెరగడమే కాకుండా పండ్ల నాణ్యత మెరుగుపడుతుందని, పంటలలో గింజ గట్టిగా పడటానికి ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు.



తద్వారా జీవ వైవిధ్యం కాపాడబడుతుందని పేర్కొన్నారు. సూర్యకాంతి, ఆవాలు, పత్తి, పుచ్చకాయ, మామిడి, కందులు, నువ్వులు, మిరప మరియు టమోటా, వంకాయ, దోసకాయ వంటి 75 శాతానికి పైగా ఆహార పంటల పరాగసంపర్కానికి (Pollination) తేనెటీగలు ఎంతో సహాయపడతాయని ఆయన వివరించారు. మన దేశీయ రకానికి చెందిన 'ఏపీస్ సేరిన ఇండికా' (భారతీయ తేనెటీగ) అడవులు, గ్రామ వాతావరణానికి ఎంతో అనుకూలమైనదని, చిన్న రైతులు దీని ద్వారా సులభంగా ఉపాధి పొందవచ్చని సూచించారు. తేనె పెట్టెలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచాలి. పెట్టెల పరిసర ప్రాంతాల్లో ఎప్పుడూ పుష్పాలు (పూల మొక్కలు) ఉండేలా చూసుకోవాలి. చీడపీడల బారి నుండి తేనె పెట్టెలను రక్షించుకోవాలి. తేనెను నైతికంగా (శాస్త్రీయ పద్ధతిలో) సేకరించాలి. తేనెటీగల పెంపకం చేపట్టే రైతులు, లబ్ధిదారులు క్షేత్రస్థాయిలో ఉన్న 'బీ మిత్ర', 'బీ సఖి' సిబ్బందితో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని ఎమ్మెల్యే కోరారు. పెంపకానికి సంబంధించిన పూర్తి వివరాలను 'బీ కైన్డ్' మొబైల్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ప్రతినిధులు, హంబుల్ బీ సంస్థ నిర్వాహకులు, చెంచు మహిళా సమాఖ్య సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## నల్లమల నుంచే కాంగ్రెస్ రాజకీయ పతనం ప్రారంభం

- అబద్ధపు హామీలు, మోసపూరిత గ్యారంటీలతో కాంగ్రెస్ పాలన
- సీఎంపై గువ్వల బాలరాజు ఫైర్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ శాసనసభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ గువ్వల బాలరాజు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం అచ్చంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "నల్లమల ముద్దుబిడ్డ" అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పాలమూరు ప్రజలను, రైతులను, నిరుద్యోగ యువతను పూర్తిగా మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బూతు పురాణాలు, అబద్ధపు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలమూరు అభివృద్ధిపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని, కేవలం రియల్ ఎస్టేట్ దందాలు, భూముల వ్యాపారాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గువ్వల బాలరాజు ఆరోపించారు. పాలమూరు ప్రజల ఆకాంక్ష అయిన అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఉమామహేశ్వర ప్రాజెక్టులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని అన్నారు. "నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఉమామహేశ్వర ప్రాజెక్ట్ భూసేకరణ పనులను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ అడుగడుగునా అడ్డుకుంటున్నారు. రైతులకు నీళ్లు అందకుండా చేసి రాజకీయ లాభం పొందాలని చూస్తున్నారు." అని మాజీ ఎమ్మెల్యే డా.గువ్వల బాలరాజు అన్నారు. "మద్దిమడుగు అంజన్న పాదాల సాక్షిగా చెబుతున్నా... నల్లమల నుంచే రేవంత్ రెడ్డి రాజకీయ పతనం ప్రారంభమవుతుంది. పాలమూరు రైతులను, పేదలను, గిరిజనులను మోసం చేసిన ఈ ప్రభుత్వ దొంగ హామీలను గ్రామ గ్రామాన బట్టబయలు చేస్తాను" అని గువ్వల బాలరాజు హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడం కాంగ్రెస్‌కు నైజంగా మారిందని, అయితే బీజేపీ ఇలాంటి బెదిరింపులకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. తాను పాలమూరు వలస కూలీ బిడ్డనని, పేదరికం, ఆకలి కష్టాలు తనకు తెలుసని పేర్కొంటూ.. దళిత, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడుతానని గువ్వల చెప్పారు. రైతుల పక్షాన నిలిచేందుకు కాంగ్రెస్ మినహా మిగతా అన్ని రాజకీయ పార్టీలు, యువకులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. త్వరలోనే పార్టీ అగ్రనాయకత్వంతో చర్చించి అచ్చంపేట నుంచే భారీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని వెల్లడించారు. మోసపూరిత సభలు మానేసి, ప్రాక్టికల్‌గా అభివృద్ధి చేసి చూపించకపోతే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ ముఖ్య నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వమే 'అధర్మం' చేస్తోంది

- ఏనుగుల రాకేష్ రెడ్డి ధ్వజం



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ధర్మాన్ని కాపాడాల్సిన వారే ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం దుర్మార్గమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మండిపడ్డారు. హన్మకొండ జిల్లా శాయంపేటలో ధ్వంసానికి గురైన హనుమాన్ ఆలయ ప్రదేశాన్ని బుధవారం ఆయన సందర్శించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రాకేష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆ హనుమంతుడి పేరు మీదే హన్మకొండ అనే పేరు వచ్చిందని, అలాంటి పవిత్ర ప్రాంతంలోనే హనుమంతుడికి అపచారం జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని కిరాతకంగా ముక్కలు చేయడం హన్మకొండ ప్రాంతానికే కీడు తెచ్చిపెడుతుందన్నారు. ఈ కీడు తొలగిపోవాలంటే, చేసిన పాపానికి పశ్చాత్తాపంగా ప్రభుత్వమే అధికారికంగా ఇక్కడ శాంతి హోమం నిర్వహించి, విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పూర్తిగా 'అధర్మ శాఖ' మంత్రిగా వ్యవహరిస్తున్నారని రాకేష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో హిందూ ఆలయాలకు రక్షణ కరువైందని విమర్శించారు. "మొన్న నర్సంపేటలో శివాలయం, నేడు శాయంపేటలో హనుమాన్ విగ్రహం ధ్వంసం కావడం యాదృచ్ఛికం కాదు. ప్రభుత్వమే అధికారికంగా ఇలా హిందూ ఆలయాల మీద, దేవతామూర్తుల మీద దాడులకు తెగబడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదు." అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మండిపడ్డారు.

## కాకతీయ మెగా టెక్స్‌టైల్ లో 3400 ఉద్యోగాలు

- దరఖాస్తు చేసుకోవాలని చల్లా ధర్మారెడ్డి పిలుపు

**పరకాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో 3,400 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ తెలపడం పరకాల ప్రాంత యువతకు శుభపరిణామమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు.పరకాల నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తాము చేసిన నిరంతర కృషి ఫలితంగానే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన పరిశ్రమల వల్లే వేలాది ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు.

